



కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 15
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
మంగళవారం 20 మే 2025

# జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు

● ప్రజలకు అందించే సేవల్లో పూర్తిస్థాయి సంతృప్తి రావాల్సిందే ● ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపడాలి ● దీపం లబ్దిదారుల ఖాతాలో ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము ● డాటా అనలిటిక్స్‌కు అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి ● ప్రభుత్వ పథకాలు, సేవలపై సమీక్షలో సిఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** జూన్ 12 తరువాత ఎప్పుడైనా రాష్ట్రంలో ఆకస్మిక తనిఖీలు మొదలు పెడతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, వివిధ ప్రభుత్వ సేవలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. ప్రతివారం నాలుగు శాఖల పరిధిలో పథకాలు, సేవలపై ప్రజలనుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను సమీక్షిస్తున్న సీఎం... రేషన్, దీపం, ఎపిఎస్ఆర్టీసీ, పంచాయతీ సేవలపై వెల్లడైన ప్రజాభిప్రాయాలను పరిశీలించారు. ఈ శాఖల పరిధిలో అమలు అవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల నుంచి ఐవిఆర్ఎస్, క్యూ ఆర్ కోడ్ వంటి విధానాల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ అభిప్రాయాలపై సిఎస్, సిఎంవో సెక్రటరీలతో ముఖ్యమంత్రి చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తుందని... అన్ని శాఖల్లో ప్రభుత్వ పనితీరు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయి సంతృప్తి కనిపించాలని సిఎం అన్నారు. కొన్ని శాఖల్లో మార్పు వచ్చిందని... అయితే ఆర్టీసీ వంటి చోట్ల ఇంకా సేవల్లో నాణ్యత పెరగాల్సి ఉందని సిఎం అన్నారు. దీపం 2 పథకం ద్వారా లబ్దిదారులకు ఏడాదికి ఇచ్చే 3 సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్దిదారుల ఖాతాలో జమ చేస్తామని సిఎం అన్నారు. లబ్దిదారులు తమకు కావాల్సినప్పుడు దీపం పథకం కింద సిలిండర్ పొందవచ్చు... అయితే వారికి మూడు సిలిండర్లకు ఇచ్చే మొత్తాన్ని ప్రభుత్వం ముందుగానే చెల్లిస్తుంది. దీపం పథకం లబ్దిదారుల నుంచి ఏజెన్సీ వాళ్లు కానీ, ఇతర స్థాయిల్లో గాని ఎక్కడా డబ్బులు అదనంగా వసూలు చేసే పరిస్థితి ఉండకూడదన్నారు.

**రేషన్ సరుకుల పంపిణీపై అభిప్రాయాలు :** మీరు ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా... అని ప్రశ్నించగా 74 శాతం మంది అవునని, వాటి నాణ్యతపై ఎలా ఉంది అంటే బాగుందని 76 శాతం మంది చెప్పారు. రేషన్ పంపిణీలో, నాణ్యతపై ప్రజల సంతృప్తిలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. అదే విధంగా గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారా... అనే అంశంలో 62 శాతం మంది లేదు అని చెప్పారు. పలు చోట్ల ఈ విషయంలో సమస్య ఉందని.... నేరుగా వారి ఖాతాల్లో ముందుగానే డబ్బులు వేయడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఆర్టీసీ సేవల విషయంలో ప్రయాణికుల నుంచి ఆశించన స్థాయిలో సంతృప్తి వ్యక్తం కాలేదని... ఈ విషయంలో అధికారులు మరింత ప్రభావవంతంగా పనిచేయాలని సిఎం అన్నారు. బస్టాండ్‌లలో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ విషయంలో ప్రయాణికుల నుంచి అసంతృప్తి వస్తోందని దీన్ని సరిచేసుకోవాలని సిఎం అన్నారు. తాగునీటిపై 44 శాతం, టాయిలెట్లపై 55 శాతం మంది అసంతృప్తి వెల్లడించారు. ఇక పంచాయతీ సేవల విషయానికి వచ్చేసరికి... ఇంటి నంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే ప్రశ్నకు 60 శాతం మంది అవుననే చెప్పారు. గతంతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ మెరుగైందని సిఎం అన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు తడిచెత్త నిర్వహణ బాధ్యత అప్పగించి... కంపోస్ట్ తయారీ చేపడతామని సిఎం అన్నారు.

**ప్రభుత్వ సేవల్లో డాటా అనలటిక్స్ కీలకం :** ప్రభుత్వ సేవల విషయంలో డాటా అనలటిక్స్ కీలకమని సిఎం అన్నారు. డాటా ఆధారంగా ఆయా ప్రభుత్వ శాఖల తమ పనితీరును క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సమర్థవంతంగా విశ్లేషిస్తే ప్రభుత్వ సేవల్లో అనూహ్య మార్పులు తేవచ్చన్నారు. ఒక ప్రభుత్వ పథకం, లేదా కార్యక్రమంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్న సందర్భంలో వాటికి కారణాలను తెలుసుకుని దానికి అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రతి శాఖలో ఉన్నతాధికారులు ఆయా శాఖలపై వచ్చే డాటాపై అనలటిక్స్ ద్వారా సేవలను మెరుగుపరచాలని సిఎం సూచించారు.

**వాట్సాప్ గవర్నెన్స్‌లో జూన్ నాటికి 500 సేవలు :** వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 325 సేవలు అందుతున్నాయి. మన మిత్ర ద్వారా వాట్సాప్ సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 45 లక్షల మంది ఈ సేవలను విజయవంతంగా వినియోగించుకున్నారు. జూన్ 12వ తేదీ నాటికి 500 సేవలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి కసరత్తు జరుగుతోంది. అదే విధంగా ప్రభుత్వ ప్రతిపాదిత డ్రోన్ సిటీ... ఓర్వకల్ ఇండస్ట్రియల్ నోడ్‌లో 300 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ఇందులో మొదటి దశ 116 ఎకరాల్లో నెలకొల్పుతున్నారు. దీనిలో 38 సంస్థలు భాగస్వాములు అయ్యేందుకు ఆసక్తి చూపించాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిపిఆర్ సిద్ధం కాగా... టెండర్ల ప్రక్రియ జూన్ 12 నాటికి పూర్తి అవుతుంది.

# పహల్గామ్ ఘటన అనంతరం దేశవ్యాప్తంగా అదే చర్చ జరిగింది: రేవంత్ రెడ్డి

● నల్లమల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రణాళిక ● రూ.12,600 కోట్లతో గిరిజన సంక్షేమ పనులు ● నల్లమల రైతులకు ఉచితంగా సౌర విద్యుత్ పంపుసెట్లు ● పోడు భూములను సాగులోకి తెచ్చేందుకు చర్యలు ● అచ్చంపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



**హైదరాబాద్,కలంకౌంటర్ :** పహల్గామ్ ఘటన తర్వాత ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలనే చర్చ దేశవ్యాప్తంగా జరిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ గతంలో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసిన ఘనతను గుర్తు చేశారు. 50 ఏళ్లు గడిచినా ఇందిరాగాంధీ పేరును ప్రజలు తలుచుకుంటున్నారంటే ఆమె పాలన ఎంత గొప్పదో అర్థమవుతుందన్నారు. ప్రతి ఆదివాసీ గుండెల్లో ఇందిరమ్మ చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. నల్లమల ప్రాంత సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై 'నల్లమల డిక్లరేషన్'ను కూడా ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి, నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించారు. ఒకప్పుడు వెనుకబాటుకు నిలయంగా ఉన్న నల్లమల ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి హోదాలో మాట్లాడటం గర్వకారణంగా ఉందని, తన గుండె ఉప్పొంగిపోతోందని ఆయన అన్నారు. తాను పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని సగర్వంగా చెప్పుకుంటానని, కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు నిర్మించాలన్నా ఒకప్పుడు పాలమూరు బిడ్డలనే పిలిచేవారని, వారు నిర్మించిన ప్రాజెక్టులే నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయని సీఎం గుర్తుచేశారు. నల్లమల ప్రాంత రైతులందరికీ ఉచితంగా సౌర విద్యుత్ పంపుసెట్లు అందిస్తామని, వంద రోజుల్లోగా సోలార్ విద్యుత్ మోటార్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. శిల్పారామం వద్ద మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు, దిగ్గజ కంపెనీలతో పోటీపడేలా స్టాళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అర్హులైన సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి భోజనం చేసి వారి ఆనందంలో పాలుపంచుకున్నానని, నేడు ప్రతి పేదవాడి ఇంటికీ సన్నబియ్యం అందుతోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ఇప్పటివరకు తమ ప్రభుత్వం రూ.60 వేల కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. దేశానికి స్వాతంత్య్రం తెచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, అందరికీ భూములు పంచి ఆత్మగౌరవం నింపాలన్నదే తమ పార్టీ సిద్ధాంతమని ఉద్ఘాటించారు.

# జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో 2కోట్ల మంది భాగస్వాములు కావాలి:సిఎస్





**అమరావతి,కలంకౌంటర్ :** జూన్ 21న విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి సమక్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో 5 లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గోవడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయి వరకూ జరిగే యోగా దినోత్సవ కార్యక్రమంలో కనీసం 2 కోట్ల మంది ప్రజలు భాగస్వాములు కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్ పిలుపునిచ్చారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం,వివిధ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు సంబంధించి స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్ (ఎస్పిఎంజి),అన్ని కోర్టు కాంప్లెక్సుల్లో మరుగు దొడ్ల నిర్మాణం తదితర అంశాలపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుండి సంబంధిత శాఖల కార్యదర్శులు,జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు.ముందుగా జూన్ 21న

- 2లో

# విశాఖ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా... హాజరుకాని నేతలపై లోకేశ్ ఆగ్రహం

● డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కేటాయింపు ● ఎన్నికకు పూర్తి స్థాయిలో హాజరు కాని టీడీపీ కార్పొరేటర్లు...! ● చర్యలు తీసుకోవడానికి వెనుకాడవద్దన్న లోకేశ్



**విజయవాడ, కలంకౌంటర్ :** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ ఎన్నిక అనూహ్యంగా వాయిదా పడటం అధికార తెలుగుదేశం పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కార్పొరేటర్లు తగినంత సంఖ్యలో హాజరుకాకపోవడమే దీనికి కారణం. ఈ పరిణామంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు జరగాల్సిన జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు మెత్తం 74 మంది సభ్యులకు గాను కేవలం 54 మందే హాజరయ్యారు. ఎన్నిక నిర్వహణకు కనీసం 56 మంది సభ్యుల కోరం అవసరం కాగా, ఇద్దరు సభ్యుల కొరత ఏర్పడింది. దీంతో అధికారులు ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే కౌన్సిల్ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయినప్పటికీ, పలువురు గైర్హాజరు కావడం గమనార్హం. ఈ పరిణామాలపై టీడీపీ అధిష్ఠానం సీరియస్‌గా దృష్టి సారించింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

- 2లో

# ఇరిగేషన్ పనులు,మరమ్మత్తులకు రూ.344 కోట్లు..

●10 లక్షల లోపు పనులు సాగునీటి సంఘాలు చేపట్టవచ్చు - మంత్రి నిమ్మల



**అమరావతి,కలంకౌంటర్ :** ఈనెలాఖరు నాటికి ఓఅండ్ఎం పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు మంత్రి నిమ్మల రామానాయుడు. ఇరిగేషన్ పనులు, నిర్వహణ మరియు మరమ్మతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ 344 కోట్లు విడదల చేశారని, ఆనిధులను సద్వినియోగం చేసుకుంటూ పనులు వెంటనే మొదలుపెట్టాలని అన్నారు. ఓ అండ్ ఎం పనులపై ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ అధికారులతో సోమవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓ అండ్ ఎం పనుల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంత పెద్ద మొత్తంలో నిధులను మంజూరు చేయటం ముదావహమన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందు అంటే, నేటి నుంచి కేవలం పది పన్నెండు రోజులు మాత్రమే ఉన్నందున తక్షణం పనులను ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉందని మంత్రి సూచించారు. ఇందుకు సూపరిండెంట్ ఇంజనీర్లు, చీఫ్ ఇంజనీర్లు నిరంతర పర్యవేక్షణ చేయటం ద్వారానే సకాలంలో పూర్తి కాగలవన్నారు. 10 లక్షలు దాటిన పనులకు ఏడు రోజుల గడువులో పూర్తి చేసే విధంగా షార్ట్ టెండర్లు పిలవాలని సూచించారు. రూ 10 లక్షల లోపు ఉన్న పనులను సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టుకోవచ్చని రామానాయుడు తెలిపారు. ఆ రకంగా ఎక్కడికి అక్కడ సాగునీటి సంఘాలను చైతన్య పరచడం ద్వారా పనులు త్వరితగతిని పూర్తయ్యేలా చైతన్య పరచాలని ఇరిగేషన్ అధికారులకు,ఎమ్మెల్యేలకు సలహా ఇచ్చారు. గత ప్రభుత్వం ఓ అండ్ ఎం పనులను గాలికి వదిలేసిందని మంత్రి విమర్శించారు. కాలవల్లో తట్ట మట్టి తీయలేదు అన్నారు. కనీస మరమ్మతులైన షట్టర్లు, డోర్లు, గేట్లకు మరమ్మతులు చేయడం మరిచిందన్నారు. కనీసం గ్రీజు కూడా పెట్టలేదు అన్నారు. గతంలో వందలు, వేల కోట్లు వ్యయం చేసి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువలు డ్రైన్స్ నిర్మిస్తే, 2019లో వచ్చిన ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలంలో కనీస మెయింటెనెన్స్ చేయకుండా గాలికి వదిలేసిందని మంత్రి రామానాయుడు విమర్శించారు. ఫలితంగా ఆ పనులన్నీ పాడు పడే పోయే విధంగా తయారయ్యాయి అని అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేసుకుంటూ ఇరిగేషన్ రంగాన్ని ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నట్టు చెప్పారు. టెలికాన్ఫరెన్స్లో పలు జిల్లాల ఎమ్మెల్యేలు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్, కడా కమిషనర్ రామసుందర్ రెడ్డి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీఈలు, ఎస్ ఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వంతో విద్యాభివృద్ధి - మంత్రి దుర్గేష్





**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతో విద్యారంగ అభివృద్ధి జరుగుతోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలోని రెండవ బ్లాక్ లో తన ఛాంబర్ లో మంత్రి కందుల దుర్గేష్ తన చేతుల మీదుగా ఎంతో మందిని టీచర్లుగా తీర్చిదిద్దిన "ఎస్ అండ్ ఎస్ పబ్లికేషన్స్" వారి డీఎస్సీ ట్రై మెథడ్స్ మెటీరియల్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అకాడమీ పాఠ్యపుస్తకాల ఆధారంగా, ప్రస్తుత సిలబస్ ప్రకారం గణితం, విజ్ఞాన, సాంఘిక శాస్త్రం ట్రై మెథడ్స్ మెటీరియల్ ను రూపొందించిన విషయ నిపుణులు బాలరాజును మంత్రి దుర్గేష్ అభినందించారు. దీంతో పాటు 1500కు పైగా బిట్స్ కలిగిన బుక్ లెట్ సైతం ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నఅభ్యర్థుల్లో స్వీయ లోపాలు సవరించుకునే ప్రాక్టీస్ బిట్స్ తో పాటు గత పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నాపత్రాలతో ఉన్న మెటీరియల్ అభ్యర్థులకు ఉపకరిస్తుందని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం 16 వేలకు పైగా పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించిన నేపథ్యంలో ఎస్జీటీ అభ్యర్థులకు మేలు చేసేలా మెటీరియల్ రూపొందించారని ప్రశంసించారు. రాష్ట్ర విద్యార్థులకు రాయితీపై మెటీరియల్ అందించాలని, అదే విధంగా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న శిక్షణా తరగతుల్లో డీఎస్సీ అభ్యర్థులకు అవసరమైన మెలకువలు అందించాలని తెలిపారు. సమాజాభివృద్ధిలో విద్యారంగానిది కీలకపాత్ర అని మంత్రి దుర్గేష్ అన్నారు. కూటమి సర్కార్ తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో విద్యారంగానికి పునర్వైభవం వచ్చిందన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# తిరుపతిలో ముమ్మరంగా హౌసింగ్ జియో ట్యాగింగ్ మేళా - కమీషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా తిరుపతి నగర పరిధిలో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. జియో ట్యాగింగ్ వెళ్ళే లబ్ధిదారుల వాహనాలను సోమవారం కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో తిరుపతి నగరంలో ఇంటి పట్టాలు మంజూరు చేసిన లబ్ధిదారులకు చిందేపల్లి, ఎం.కొత్తపల్లి, కల్లూరు, లేఔట్లలో నిర్మిస్తున్న ఇళ్లకు జియో ట్యాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. మొత్తం 19,086 మంది లబ్ధిదారులకు గాను దాదాపు 10,000 వేల మందికి జియో ట్యాగింగ్ పూర్తయిందని, మిగతా పెండింగ్ లబ్ధిదారులకు ఈ 19, 20, 21 తేదీలలో మూడు రోజులపాటు 9086 మంది లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ మూడు రోజులలో ఎవరైనా వెళ్లకపోతే మిగతా రోజులలో లబ్ధిదారులు వారికి ఇచ్చిన ఇంటి పట్టా ఆధారంగా లేఅవుట్ కు వెళ్లి లబ్ధిదారులు జియో ట్యాగింగ్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమ-రయ్య, హౌసింగ్ డిఈఈ లు మోహనరావు, శ్రీనివాస్, కుమార్, హౌసింగ్ స్పెషలిస్ట్ డాక్టర్ కాటమరాజు, సెక్టోరల్ ఆఫీసర్లు, సచివాలయ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ తల్లి కొలుపుల మహోత్సవంలో అన్నా



**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని మాలపాటిపల్లె గ్రామంలో గజ్జలకొండ ఎంపిటిసి సభ్యులు మాలపాటి శ్రీనివాసరెడ్డి ఆహ్వానం మేరకు రేణుక ఎల్లమ్మ తల్లి కొలుపుల కార్యక్రమంలో పాల్గొని దర్శించుకున్న మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ సమనవ్యకర్త అన్నా రాంబాబు , నాయకులు పాల్గొన్నారు.

# హక్కులను కాలరాస్తే కఠిన చర్యలు

- పాత ఫిర్యాదుల్లో అవసరమైతే జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకువెళ్తాము.
- మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నూతనంగా వెబ్ సైట్
- డాక్టర్. రాయపాటి శైలజ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్.





**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఏ ఒక్క మహిళకు అన్యాయం జరిగినా, వారి హక్కులను కాలరాసేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ గా . రాయపాటి శైలజ మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ శైలజ మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా, రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని తెలిపారు. గత ఐదేళ్లలో మహిళా కమిషన్ లో ఫిర్యాదులను పట్టించుకోలేదని, పాత ఫిర్యాదుల దుమ్ముదులిపి ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని హామి ఇచ్చారు. అవసరమైత జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియా వేదికగా మహిళలపై అసభ్య పోస్ట్ లు పెడుతున్నారని, వారు తమ తీరు మార్చుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని రాయపాటి శైలజ హెచ్చరించారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే మహిళలపట్ల గౌరవం పెంచేలా అవగాహన సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. దీంతో ఖచ్చితంగా సమాజంలో మార్పు తీసుకురావచ్చన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ మహిళలకు అన్యాయం జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని, సమాచారం మాకు అందిన వెంటనే పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. ఫిర్యాదుల కోసం తమ శాఖ ఆధ్వర్యంలో ఒక వెబ్ సైట్ రూపొందించనున్నామన్నారు. ఈ వెబ్ సైట్ ద్వారా ఫిర్యాదులు చేయడంతో పాటు తమ ఫిర్యాదు ఏ దశలో ఉందో కూడా తెలసుకునే ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ కు పూర్వ వైభవం తీసుకువస్తామని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప మ-ఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వివిధ నాయకులకు తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ ను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, ప్రముఖ వ్యాపార, విద్యా వేత్త రాయపాటి గోపాలకృష్ణ, రమేష్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రమేష్ బాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు శివ నాగమల్లేశ్వరరావు, బంధువులు, కుటుంబ సభ్యులు ,అభిమానులు తదితరులు అభినందించారు.

# వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడండి - కమిషనర్ ఎన్.మౌర్య





**తిరుపతి,కలంకౌంటర్ :** వర్షాలు కురుస్తున్న తరుణంలో నగరంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ కి ఫోన్ ద్వారా 10 మంది సమస్యలు తెలుపగా, 32 మంది నేరుగా వచ్చి కమిషనర్ కు వినతులు అందజేశారు. శ్రీనివాసపురం వద్ద డ్రైనేజీ కాలువ పనులు చేయాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భూపాల్ హౌసింగ్ నందు నీరు వృథా చేస్తున్నారని, ఒకే సమయంలో నీరు సరఫరా చేయాలని, మా ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్టు తొలగించాలని, భవానీ నగర్ నందు డ్రైనేజీ కాలువ మరమ్మత్తులు చేపట్టాలని, గెస్ట్ లైన్ డేస్ హెూటల్ సమీపంలో మాస్టర్ ప్లాన్ రోడ్డులో భూమి కోల్పోయాను టిడిఆర్ బాండ్ ఇప్పించాలని, సాయి విష్ణ లేఔట్ నందు తుడా రోడ్డులో ఆక్రమణ నిర్మాణాలు తొలగించాలని, రైల్వే స్టేషన్ వద్ద తమ బంక్ తొలగించారు, బ్యాంక్ ఆఫ్ బరోడా పక్కన ఏర్పాటు చేసుకుంటానని కోరారు, వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి నాయకులు కోరారు. ఆయా విభాగాల అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఎక్కడా మురుగునీరు ఆగకుండా, చెత్త తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హాసీమ్, ఏసిపిలు బాలాజి, మూర్తి సర్వేయర్ కోటేశ్వర రావు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.5.78 కోట్లతో విద్యాలయాలకు నూతన భవనాలు, అదనపు వసతులు

- పేదల విద్యకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది
- విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన జగన్ సర్కార్
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్





**పల్నాడుకలంకౌంటర్ :** పేదల విద్యకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో సోమవారం పర్యటించిన మంత్రి., మాచర్ల నియోజక వర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఒక్క పల్నాడు జిల్లా పరిధిలోని సుమారు రూ. 5.78 కోట్లతో విద్యాలయాలకు నూతన భవనాలు, అదనపు వసతుల కల్పన పనులకు మంత్రి గొట్టిపాటి భూమిపూజ చేశారు. ముందుగా కారంపూడిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 2.55 కోట్లతో ఏర్పాటు చేయనున్న అదనపు వసతుల పనులకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం దుర్గిలో కేజీబీవీ అప్ గ్రేడ్ జూనియర్ కళాశాలలో రూ. 1.51 కోట్లతో నిర్మించే అదనపు భవనాలకు గొట్టిపాటి భూమి పూజ చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో రూ. 1.72 కోట్లతో నిర్మించనున్న బాలికల వసతి గృహ సముదాయానికి మంత్రి గొట్టిపాటి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనల అనంతరం మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ... పేదల పక్షపాతి కూటమి ప్రభుత్వమని తెలిపారు. విద్య గొప్పతనాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలతో మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తున్నామని వెల్లడించారు. ఎంతో కీలకమైన విద్యా వ్యవస్థను జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని విమర్శించారు. గౌరవ ఉపాధ్యాయ వృత్తిని జగన్ మోహన్ రెడ్డి ఏనాడో అవమానించారని అన్నారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపాలాగా ఉంచిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి.., దేశంలోనే నెంబర్ 1గా తీర్చుదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పెడన తోటముల పార్టీ కార్యాలయంలో మినీ మహానాడు... కాగిత



**పెడన,కలంకౌంటర్ :** తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ..తెలుగుదేశం పార్టీ..! ఆరు నెలల కాలంలో పార్టీని అధికారం వైపు నడిపించిన ధీశాలి అన్న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ.. పెడన నియోజకవర్గ స్థాయి "మినీ మహానాడు" పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన తోటమూల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించటమైనది. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రివర్యులు కొల్లు రవీంద్ర ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ, కృష్ణా జిల్లా టిడిపి అధ్యక్షుడు కొనకళ్ళ నారాయణరావు రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బుల్లయ్య పెడన నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు గొట్టుముక్కల రఘురామరాజు పెడన నియోజవర్గ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు మరియు మండల అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు పెడన సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పసుపు సైన్యం, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో 2కోట్ల మంది భాగస్వాములు కావాలి:సిఎస్

(మొదటిపేజీ తరువాయి)

విశాఖపట్నంలో జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల గురించి సిఎస్ మాట్లాడుతూ విశాఖపట్నం రామకృష్ణ బీచ్ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి సమక్షంలో జరిగే ప్రధాన వేదిక వద్ద 5లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గొని యోగాసనాలు వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయి వరకు నిర్వహించే యోగా దినోత్సవ వేడుకల్లో కనీసం 2కోట్ల మంది భాగస్వాములయ్యేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.దైనందిన జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు యోగా ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు కృషి చేయాలని ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకుల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం సర్కులర్ ఆదేశాలు, జిఓలను జారీ చేయడం జరుగుతుందని సిఎస్ విజయానంద్ పేర్కొన్నారు. స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్ గురించి మాట్లాడుతూ 50 కోట్ల రూపాయలు పైబడిన ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు,క్లియరెన్సులు తదితర అంశాలను ఈఎస్పిఎంజి మానిటరింగ్ గ్రూప్ పర్యవేక్షిస్తుందని తెలిపారు.ఇందుకు సంబంధించి ఇది తొలి సమావేశమని ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించడం జరుగుతుందన్నారు.జిల్లా కలెక్టర్లు భూ సంబంధిత అంశాల తోపాటు ఇతర సమస్యలను గుర్తించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు.ముఖ్యంగా ఇంటర్ డిపార్టుమెంటల్ కోఆర్డినేషన్ ద్వారా ఆయా ప్రాజెక్టుల పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని కార్యదర్శులు,కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని కోర్టు కాంప్లెక్సుల్లో మూడు మాసాల్లోగా మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని జిల్లా కలక్టర్లను సిఎస్ విజాయనంద్ ఆదేశించారు.ఇందుకు సంబంధించి ఇప్పటికే సుమారు 50 కోట్ల రూ.ల పనులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.ఆయా పనులను అత్యంత ప్రాధాన్యతా క్రమంలో వేగవంతంగా పూర్తి చేయాలని కలక్టర్లను ఆదేశించారు. ఈసమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నిర్వహణ రాష్ట్రస్థాయి పర్యవేక్షణ నోడలు అధికారి యం.టి.కృష్ణబాబు అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.2023లో గుజరాత్ రాష్ట్రం సూరత్ లో నిర్వహించిన 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఒకే ప్రాంతంలో లక్షా 53వేల మంది పాల్గొని గిన్నిస్ రికార్డు సాధించగా ఆవేడకల్లో మొ-త్తం కోటి 25 లక్షల మంది భాగస్వాములు అయ్యారని తెలిపారు.కాగా జూన్ 21న విశాఖ ఆర్కె బీచ్ లో నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల ప్రధాన వేదిక వద్ద ప్రత్యక్షంగా 5లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.అలాగే రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 2కోట్ల మంది భాగస్వాములు అయ్యే విధంగా కృషి చేయాల్సి ఉందన్నారు.ఈఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని' Yoga for One Earth, One Health అనే నినాదంతో యోగాపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈనెల 21 నుండి జూన్ 21 వరకూ నెల రోజులపాటు ప్రతి ఒక్కరూ యోగాను ఆసరించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర పేరిట ఒక ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు.ఈకార్యక్రమాన్ని మూడు దశలుగా చేపట్టనున్నట్టు అనగా ఈనెల 21 నుండి 27 వరకూ ప్రాథమిక దశ కింద ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ శిక్షణ,28 నుండి జూన్ 3 వరకూ మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ,జూన్ 4 నుండి 16వరకు గ్రామ,వార్డు స్థాయిల్లో శిక్షణ నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈనెల 21న అన్నిజిల్లాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి కనీసం 10 వేల మంది ప్రజాప్రతినిధులు, యోగా శిక్షకులు,పిఇటిలు,యోగా అబ్యాసకులు తదితరులతో కర్టెన్ రైజర్ ఈవెంటను నిర్వహించాలని సూచించారు.ఈనెల 27న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో సమావేశమై వారి భాగస్వామ్యంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని చెప్పారు.జూన్ 21న రాష్ట్ర వ్యాప్తంగా 100 పర్యాటక మరియు ఆధ్యాత్మిక కేంద్రాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈసమావేశంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్,ఐఅండ్ఐ శాఖ కార్యదర్శి డా.ఎన్. యువ రాజ్,న్యాయ శాఖ కార్యదర్శి ప్రతిభా దేవి,ఐఅండ్పిఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్ల పాల్గొన్నారు.అలాగే పలువురు కార్యదర్శులు,జిల్లా కలెక్టర్లు వర్చువల్ గా పాల్గొన్నారు.

# విశాఖ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా... హాజరుకాని నేతలపై లోకేశ్ ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

నారా లోకేశ్, ఈ ఎన్నికకు గైర్హాజరైన కార్పొరేటర్లకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించినట్లు సమాచారం. కొందరిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడవద్దని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కీలక సూచనలు చేసినట్లు తెలిసింది. ఈ పరిణామాలపై ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ... జీవీఎంసీలో తమకు కావాల్సినంత సంఖ్యాబలం ఉందని తెలిపారు. "డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో నిర్ణయం తీసుకోవడంలో కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమే. గత రాత్రి 11 గంటలకు ఆ పదవిని జనసేన పార్టీకి కేటాయించాలని నిర్ణయించాం" అని పల్లా తెలిపారు. టీడీపీలో కూడా ఆ పదవిని ఆశించేవారు ఉన్నారని ఆయన గుర్తుచేశారు. ఎన్నిక వాయిదా పడటానికి సమన్వయ లోపం కూడా ఒక కారణమని, అందుకే ఈ ఇబ్బంది తలెత్తిందని ఆయన అంగీకరించారు. జీవీఎంసీ కౌన్సిల్‌కు సభ్యులంతా హాజరవుతారని, దీనికి తాను పూర్తి బాధ్యత వహిస్తానని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రేపు జరగనున్న ఎన్నికకు సభ్యులందరూ హాజరై, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసేలా చూడాలని పార్టీ శ్రేణులకు అధిష్ఠానం నుంచి గట్టి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం విశాఖ రాజకీయాల్లో కొంత అలజడి సృష్టించింది.

# బాధితులకు న్యాయం చేయాలి - జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్




**ఒంగోలు,కలంకౌంటర్ :** ప్రజా పిర్యాదులకు త్వరిత పరిష్కారం చూపుటకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (మీ కోసం) కార్యక్రమమును జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లాలో వివిధ గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుండి పిర్యాదుదారులు నేరుగా వచ్చి తమ తమ పిర్యాదులను వ్రాతపూర్వకంగా జిల్లా ఎస్పీ కి , పోలీస్ అధికారులకు విన్నవించుకున్నారు. అధికారులు వారితో ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకుని వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. అందిన ఆయా ఫిర్యాదుల గురించి సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ఆయా ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కారించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నివేదిక కూడా ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కొరకు పోలీసు స్టేషన్లు/కార్యాలయాలకు వచ్చు పిర్యాదుదారులతో పోలీసు అధికారులు , సిబ్బంది మర్యాదగా వ్యవహరించి చట్ట పరిధిలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేదింపులు, భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్బి డిఎస్పీ సురేష్ బాబు, మహిళా పియస్ డిఎస్పీ రమణ కుమార్, SC/ST సెల్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, డీటీసి ఇన్స్పెక్టర్ షమీముల్లా, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియా సుల్తాన్ , సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలి - జిల్లా ఎస్పీ తుషార్ డూడి




**బాపట్ల,కలంకౌంటర్ :** నిర్ణిత గడువులోగా అర్జీ దారుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహిచిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారులు వారి సమస్యలను స్వేచ్ఛగా ఎస్పీకి విన్నవించుకున్నారు. కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్థి వివాదాలు, ఇతర సమస్యలపై వచ్చిన 50 అర్జీలను ఎస్పీ పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి అర్జీలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కరానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని తెలిపారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని పోలీస్ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో గూడూరు రాధాకృష్ణ




**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్, తమిళనాడు రాష్ట్రంలోని ఎయిర్ పోర్టుల అడ్వైజరీ కమిటీ సభ్యులు, ఆఫ్రికా ఖండంలోని గాబన్ కు దక్షిణ భారతదేశ రాయబారి, ఇమేజ్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ గూడూరు రాధాకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన రాధాకృష్ణకు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు సూచనలతో ఆలయ సూపర్నెండెంట్ అచ్యుత మధుసూదనరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బుద్దు పవన్ కుమార్ శర్మ బుద్ధు సతీష్ శర్మ ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో రాధాకృష్ణ కుటుంబ సమేతంగా పాలు పోసి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం వారు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకొనగా, ఆలయ పండితులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణ దంపతులను అచ్యుత మధుసూదనరావు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

# ప్రసన్నాంజనేయ సన్నిధిలో ఇంటూరి

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఇంటూరి దంపతులు




**కందుకూరు,కలంకౌంటర్ :** బాపట్ల జిల్లా అద్దంకి మండలం శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వద్ద నూతన ధ్వజస్తంభం, ఆలయ కలిశ పునఃప్రతిష్ట, మహా కుంభాభిషేకం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాల్లో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ, ఆలయ వేద పండితులు ఇంటూరి దంపతులకు ఘన స్వాగతం పలికారు.. అనంతరం ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన పీఠాధిపతుల వద్ద ఇంటూరి కుటుంబం ప్రత్యేక ఆశీర్వచనాలు తీసుకున్నారు. శింగరకొండ జరుగుతున్న దైవందిత కార్యక్రమాలలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ,సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్న విశ్రాంత సిఎస్



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవిలో భక్తుల చేత విశేష పూజలు అందుకుంటున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని విశ్రాంతి చీఫ్ సెక్రటరీ ఎల్.వి సుబ్రమణ్యం దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన సుబ్రమణ్యం దంపతులకు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కుబడులు చెల్లించుకున్న అనంతరం సుబ్రమణ్యం దంపతులు శ్రీ స్వామి వారిని దర్శించుకొనగా, ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. విశ్రాంత సిఎస్ సుబ్రహ్మణ్యం దంపతులను ఆలయ మర్యాదలతో శ్రీరామ వరప్రసాదరావు ఘనంగా సత్కరించి, ప్రసాదాలను అందజేసి, శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు.

# వైభవంగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట



**పొన్నలూరు, చెరుకూరు,కలంకౌంటర్ :** పొన్నలూరు మండలం చెరుకూరు గ్రామంలో సోమవారం ఉదయం శ్రీ దుర్గమల్లేశ్వర స్వామి, శ్రీ పార్వతి దేవి, ధ్వజస్తంభం, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ట ఆలయ అర్చకులు గూడా ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య ఎంతో వైభవంగా జరిగింది. ప్రతిష్టానంతరం శివపార్వతుల కళ్యాణం కన్నుల పండుగ జరిగింది. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పరమశివుని విగ్రహం భక్తులను ఆకొట్టుకుంది.ఆలయ ప్రాంగణం శివనామ స్మరణతో మార్మోగింది. అనంతరం అన్న ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన బస్ సర్వీస్ ను స్వయంగా నడిపి ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి




**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో నందు నూతనంగా కందుకూరు నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నకు బస్ సర్వీస్ ను సోమవారం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు...ముందుగా బస్ సర్వీస్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి ఆర్టీసీ అధికారులు, తెలుగునాడు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానానికి నడుపుతున్న ఈ నూతన బస్ సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్, ఆర్టీసీ అధికారులు కందుకూరు మండలం పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వర రావు,తెలుగు నాడు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ




**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

# వైభవోపేతంగా శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్ల దివ్య శాంతి కల్యాణోత్సవం



**విజయవాడ రూరల్,కలంకౌంటర్ :** విజయవాడ రూరల్ మండలం నున్నలోని శ్రీ రుక్మిణీ, సత్యభామ సమత వేణుగోపాలస్వామి వార్ల దివ్య శాంతి కల్యాణోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవోపేతంగా నిర్వహించారు. అశేష భక్త జనసందోహం సమక్షంలో దేవదాయ, ధర్మదాయశాఖ కార్యనిర్వహణాధికారి ఎస్ హేమలతాదేవి పర్యవేక్షణలో స్వామి వార్ల దివ్య శాంతి కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. సుమారు 600 సంవత్సరాల క్రితం నూజివీడు జమిందారు మేకా రాజా వేంకటాద్రి అప్పారావు జమిందారు ప్రతిష్టించిన శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్ల దేవస్థానంలో ఐదు రోజులపాటు పంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమమును అనుసరించి నిర్వహించిన అష్టబంధన సంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. తొలుత స్వామి వార్లకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, కుంభారాధన, ప్రధాన హోమములు, మహా పూర్ణాహుతి, కళావాహన, అర్చన, బ్రహ్మఘోష, నీరాజనము నిర్వహించారు. ఐదు రోజుపాటు పీటలపై కూర్చున్న దంపతులు భక్త ప్రవత్తులతో మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థానం జీర్ణోద్ధరణ జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం సాయంత్రం దేవస్థానం అర్చకుడు రొంపిచర్ల దత్తకుమార్ ఆధ్వర్యంలోని స్వామి వార్లకు దివ్య శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. దీనికి ముందు తిరుమల తిరుపతి దేవస్థానం ముఖ్య ప్రసంగికులు సుదర్శనం సీతారామాచార్యులు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జ్యోతిష్య పండిట్ డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్, రుత్విక్కులు రొంపిచర్ల లోకాభిరాము, పరుచూరి నరహరి, అగ్నిహోత్రం చక్రధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.



కాకతీయుల చరిత్రాత్మక కళ ఉట్టిపడేలా వరంగల్ రైల్వే స్టేషన్ సుందరంగా రూపుదిద్దుకుంది. మే 22న పునః ప్రారంభానికి సిద్ధమవుతోన్న ఈ రైల్వే స్టేషన్ ఫొటోలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ 'ఎక్స్'లో షేర్ చేసుకున్నారు.

-వరంగల్ ,కలంకౌంటర్ :

## ప్రజలకు అందుబాటులో పోలీసు శాఖ

● జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జిల్లా పోలీసు కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సల్ సిస్టమ్) మీ కోసం కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి విచ్చేశారు. ఎస్పీ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను నిశితంగా విని, వారి సమస్య ఆధారంగా సంబంధిత పోలీసు అధికారులకు ఆఫిర్యాదులపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం చేయకుండా పని చేయాలని స్పష్టం చేశారు."మీ కోసం" కార్యక్రమంలో భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, ఉద్యోగాల పేరుతో జరిగిన మోసాలు, సివిల్ తగాదాలు వంటి వివిధ అంశాలపై మొత్తం 33 పిటీషన్లు స్వీకరించారు. ఈ పిటీషన్లను వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.

## మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఉదయపు నడక మిత్రమండలి , మహిళా విభాగం ఆధ్వర్యంలో 17వ రోజు మజ్జిగ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షులు జల్దు మురళి నాథ్ ట్రెజరర్ వేద లక్ష్మి నరసింహ ,జోన్ చైర్మన్ కారుమూరి రాజేంద్ర ప్రసాద్, మాటూరిరామ్మోహన్ ,కొప్పర్తి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పి ఎం జె జ్యువెలరీ నక్లెస్ మేళా లో పాల్గొన్న వాణివెంకట్



**గుంటూరు, కలంకౌంటర్ :** గుంటూరు బ్రాంచ్ పి ఎం జె జ్యువెలరీ షోరూం లో నెక్లెస్ మేళా లో జిల్లా బిజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు త్రిపురమల్లు వాణి వెంకట్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెక్లెస్ మేళా లో కొత్త కొత్త నెక్లెస్ డిజైన్స్ ఆవిష్కరించారని, ఈ నెల ఆఖరి వరకు ప్రతి ఒక్క గ్రాము మీద 101 రూపాయి తగ్గింపు జరుగుతుందని తెలిపారు ఈ అవకాశాన్ని గుంటూరు పుర మహిళలందరూ తప్పకుండా వినియోగించుకోవాలని ఆమె కోరారు.పి ఎం జె జ్యువెలర్స్ వారికి చాలా బ్రాంచ్ లు ఉన్నాయని లేని చోట ఇంకా కొన్ని నెలకొల్పాలని ఆశిస్తున్నారని వాణి వెంకట్ త్రిపురమల్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ కల్పన, సుజాతపాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఉగ్రవాద కదలికలపై అప్రమత్తత అవసరం: సీఎస్, డీజీపీలకు పవన్ కల్యాణ్ లేఖ

**విజయవాడ, కలంకౌంటర్ :** జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉగ్రవాద కదలికలు, వారి సానుభూతిపరుల జాడలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పోలీస్ శాఖ, పరిపాలనా శాఖలకు సూచించారు. ఈ మేరకు పలు సూచనలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికీ, రాష్ట్ర డీజీపీకి లేఖలు రాశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం వచ్చిందనీ, దీనిపై సంబంధిత శాఖలతో సమన్వయం అవసరమని చెప్పారు. విజయనగరంలో ఒక యువకుడికి ఐఎస్ తో సంబంధాలున్నాయని, పేలుళ్లకు కుట్ర పన్నిన విషయాన్ని తెలుగు రాష్ట్రాల నిఘా వర్గాలు గుర్తించి అరెస్టు చేసిన క్రమంలో మన రాష్ట్ర పోలీసులు మరింత కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఉగ్రవాద సానుభూతిపరులు, స్లీపర్ సెల్స్, అక్రమ వలసదారులు, రోహింగ్యాల ఉనికిపై, అలాంటివారి కదలికలపైనా అన్ని జిల్లాల అధికారులు తక్షణం అప్రమత్తమై, ఎక్కడైనా ఉగ్ర నీడలు, వారి జాడలు కనిపిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు.

# కష్టపడిని ప్రతి ఒక్కరికీ పదవులు వస్తాయి -రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర





**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన మన్నూరు సుగుణమ్మ ప్రమాణ స్వీకార వేడుకలు విజయవాడ లోని ఐలాపురం హోటల్ లో ఏర్పాటు చేశారు.. ఈ వేడుకల్లో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాము పడిన కష్టానికి ప్రతిఫలం దక్కుతుందనడానికి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేటీ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన సుగుణమ్మ ఉదాహరణ అని అన్నారు... సుగుణమ్మ కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని సభా వేదికగా పంచుకుంటున్నానన్నారు. కూటమి పొత్తులో భాగంగా సీటు కోల్పోయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించడంలో సుగుణమ్మ అత్యంత కీలకంగా వ్యవహరించారన్నారు. గతంలో శాసనసభ్యులుగా తిరుపతి ప్రజలకు సేవలు అందించారన్నారు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సేవలు అందించే అవకాశం వచ్చిందన్నారు.. రాష్ట్రాన్ని పచ్చదనంగా మార్చేందుకు సుగుణమ్మ చర్యలు తీసుకోవాలన్నారు.. ఆమె పర్యవేక్షణలో పరిశుభ్రత, పచ్చదనంతో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన అనంతరం సన్మాన వేడుకలో మన్నూరు సుగుణమ్మ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక పదవి ఇచ్చి నాకు గురుతర బాధ్యతను అప్పగించారన్నారు. నాకిచ్చిన పదవి కి సంపూర్ణ న్యాయం చేసేందుకు నూటికి నూరు శాతం చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ఆధ్యాత్మిక నగరం తిరుపతి ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. రాజధాని అమరావతి ని పచ్చదనం తో నింపేందుకు తన వంతు కష్టపడి పనిచేస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు, ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని కాపాడుకుని పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పచ్చదనాన్ని కాపాడుకుంటేనే మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు. నన్ను ప్రత్యేకంగా గుర్తించి ఈ పదవి ఇచ్చి మన అందరికీ సీఎం చంద్రబాబు నాయుడు గౌరవాన్ని కల్గించారన్నారు. సుందర, వికసిత్ ఆంధ్రప్రదేశ్ గా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తానన్నారు. నాకిచ్చిన ఈ బాధ్యతను నూటికి నూరు శాతం నెరవేర్చుతానన్నారు. నాకు ఇచ్చిన పదవికి తప్పని సరిగా న్యాయం చేస్తానని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన మన్నూరు సుగుణమ్మ ను ఘనంగా సన్మానించిన వారిలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, అభిమానులు లతోపాటు శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, పులివర్తి నాని , శ్రావణి, ఎమ్మెల్సీ గ్రీష్మ, ఐలాపురం వెంకయ్య తదితరులు ఉన్నారు.

# కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా..

-మినీ మహానాడులో ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గం లో కష్టపడిన తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మినీ మహానాడులో కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కందుకూరు పట్టణంలో శ్రీ లక్ష్మీ తిరుమల కళ్యాణమండపం నందు మినీ మహానాడు అత్యంత వైభవంగా జరిగింది. కందుకూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కొన్ని సమస్యలను శాసనసభ్యులు దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ తో కలసి పనిచేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ఇవ్వనంత సీఎం రిలీఫ్ ఫండ్ మన నియోజకవర్గానికి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. కందుకూరిని ప్రకాశం జిల్లాలో తిరిగి త్వరితగతిని కలపటం మరి కొన్ని సమస్యలను ఈనెల 27 ,28 ,29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా కందుకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపించడానికి తన ఇష్టదైవం మాలకొండ స్వామి తనకు తెలివితేటలని ఇచ్చారని అన్నారు. ఎన్నడూ లేనివిధంగా కందుకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున విచ్చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు మహిళలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల



తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల నుండి అందే అర్జీల పట్ల అత్యధిక ప్రాధాన్యత

● జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రజల నుండి అందే అర్జీల పట్ల అత్యధిక ప్రాధాన్యత నిచ్చి సానుకూలంగా సకాలంలో పరిష్కరించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డిఆర్ఓ కె చంద్రశేఖర రావు కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి ఆర్డిఓ కే స్వాతి సర్వ శిక్ష ఏపీసీ మిదినీసింగ్ లతో కలసి మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అపకారం కలెక్టరేట్లో మొత్తం 157 అర్జీలు అందాయి. వాటిలో కొన్నింటి వివరాలు ఇలా ఉన్నాయి: పెడన మండలం తోటమూల గ్రామానికి చెందిన దివ్యాంగులు వల్లభ ఆదినారాయణ అర్జీ ఇవ్వడానికి రాగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ స్వయంగా వేదిక నుండి క్రిందకి దిగివచ్చి అతని సమస్యను ఎంతో ఓపికగా ఆలకించి అతను కోరిన అంత్యోదయ అన్న యోజన పథకం కింద రేషన్ కార్డును మంజూరు చేయాలని డి.ఎస్.ఓ పార్వతికి సూచించారు. మచిలీపట్నం నగరంలోని చిలకలపూడి నివాసి కే దేవి మాట్లాడుతూ తనకు ఇళ్ల స్థలము లేదని, ఇళ్ళ స్థలం కోసం సచివాలయంలో అర్జీ పెట్టుకున్నామని, ఇంతవరకు ఎవరు పట్టించుకోలేదని, తనకు చేయి కూడా విరిగిందని, తాము అద్దె ఇంట్లో నివసిస్తున్నామని అద్దెలు కట్టుకోలేక పోతున్నామని ఇళ్ల స్థలము ఇవ్వవలసిందిగా కోరుతూ అర్జీ అందజేశారు. కోడూరు మండలం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి ఆవుల బసవయ్య మాట్లాడుతూ రామకృష్ణాపురం రెవిన్యూ లో ఇరాలి మేజర్ మురికి కాలువ ఉన్నదని, దాని కింద చిన్న సన్నకారు రైతులు ఆక్వా సాగు చేస్తున్నారని, కొంతమంది మత్స్యకారులు వేట ద్వారా జీవనం సాగిస్తున్నారని, మోపిదేవి భాస్కరరావు చెరువు నుండి పాలకాయ తిప్ప అవుట్ ఫాల్స్ వరకు డ్రైనేజీ కట్ట గండ్లు పడి, ముళ్ళ తుమ్మ చెట్లతో మూసుకుపోయి నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని, ఆ గండ్లను పూడ్చి ముళ్ళ మండలను తొలగించాలని ఆక్వా రైతులు, మత్స్యకారులు నడవడానికి సౌకర్యం కల్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. గూడూరు మండలం ముక్కోలు ఎస్సీ కాలనీ వాసులు శాకల మహేష్, ఎస్ వాసు, ఎన్ ప్రభాకర్ రావు, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు తమ గ్రామంలో కర్ర సూరమ్మ అనే మహిళకు జగనన్న కాలనీలో ఇళ్ళ స్థలం మంజూరు చేశారని, ఇంటి నిర్మాణం కోసం 40 సిమెంట్ కట్టలు, 30 ఇనుప చువ్వలు, 10 టన్నులు ఇసుక గ్రామ సచివాలయం ద్వారా ఇచ్చారని ఆ సామాగ్రిని ఆమె కుమారుడు జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం చేయకుండా ముక్కోలు ఎస్సీ కాలనీ వెళ్లే రహదారి పక్కన పిడబ్ల్యూ కాలువ గట్టుమీద ఇంటి నిర్మాణం చేశారని, ఆ నిర్మాణానికి రోడ్డు కానించి దడీ కట్టారని మనుషులు పశువులు దడి పక్కకి వెళ్తుంటే నానా దుర్భాషలాడుతున్నారని, వాహనం రాకపోకలకు ఇబ్బంది కరంగా ఉందనీ, ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగపరిచిన అధికారుల మీద శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని, సొమ్ము తిరిగి వసూలు చేయాలని, పట్టాను రద్దు చేయాలని, మార్జిన్ లేకుండా ఆక్రమించుకున్న స్థలాన్ని తిరిగి మార్జిన్ ఇప్పించాలని ఫిర్యాదు చేస్తూ అర్జీ అందజేశారు. ఆంధ్రప్రదేశ్ మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి బిక్షాలు అర్జీ అందజేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్ఏ మేల్ గా పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం ఉత్తర్వులు అనుసరించి ప్రస్తుత పిహెచ్సిఎల్ నుంచి తప్పించి ఎన్ వి బి డి సిపి ప్రోగ్రాం నందు పనిచేయుట కోసం రీడిప్లయ్మెంట్ ద్వారా సర్దుబాటు చేస్తున్నారని ఈ విషయంలో ఎస్సీ కేటగిరి నందు అభ్యర్థులను నూతనంగా అమలు జరుగుతున్న ఎస్సీలు- ఏబీసీ- వర్గీకరణ ప్రకారం చేయాలని కోరారు. అంతకుమునుపు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఐ గాట్ కర్మయోగి ఆన్లైన్ శిక్షణ తరగతుల కింద 8 కోర్సులను ప్రతి ఒక్క ఉద్యోగి పూర్తిచేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ తరగతుల పైన త్వరలో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమీక్ష జరుగుతున్నారని, ప్రస్తుతం కృష్ణాజిల్లా 18వ స్థానంలో ఉందని ఈనెల 20వ తేదీ మంగళవారం లోగా అందరూ ఉద్యోగులు శిక్షణ తరగతులు పూర్తిచేసి జిల్లాను ముందంజలో నిలిపేలా చొరవ చూపాలన సూచించారు. జిల్లాలో గత సంవత్సర కాలంగా వివిధ ప్రభుత్వ శాఖలు సాధించిన ప్రగతిపై ఒక పుస్తకం తయారు చేస్తున్నామని ఇందుకు సంబంధించిన వివరాలను ఇంకా చాలామంది అధికారులు ఇవ్వలేదంటూ ఈ సోమవారం సాయంత్రం కల్లా సిపిఓ కు ఆ నివేదికను అందజేయాలని సూచించారు . రాష్ట్ర ప్రభుత్వం బదిలీలను అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఆ ఉత్తర్వుల మేరకు అధికారులందరూ వారి పరిధిలో బదిలీల ప్రక్రియ వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం పై రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ఈనెల 20వ తేదీ మంగళవారం జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్నారని ఆలోగా పెండింగ్లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 22,770 అర్జీలు రాగా అందులో 20,865 అర్జీలు పరిష్కరించబడ్డాయని ఇంకా 1905 అర్జీలు పెండింగ్లో ఉన్నాయని వాటిని కూడా సకాలంలో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా 13 గడువు మీరిన అర్జీలు ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయని వాటిలో పంచాయతీరాజ్ శాఖలో 5, ఆర్డబ్ల్యూఎస్ శాఖలో 6 అర్జీలు ఉన్నాయని వాటిని ఇంకా ఎందుకు పరిష్కరించకుండా ఉంచారని ప్రశ్నిస్తూ వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. కోర్టుకు సెలవులు అయినప్పటికీ కోర్టు జారీ చేసిన చివరి ఉత్తర్వులను ఇంకా అమలు చేయలేదని వాటిని కచ్చితంగా సంబంధిత అధికారులు అమలు చేయాలన్నారు. జలవనరుల శాఖలో ఇంకను 11 కేసులు కౌంటర్లు దాఖలు చేయలేదని వాటికి వెంటనే కౌంటర్లు వేయాలని ఆదేశించారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం 2013కు సంబంధించి గోడపత్రాలను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com